డీప్ మ్యాన్‌హోల్.. జర జాగ్రత్త

బంజారాహిల్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది. జూలైలో రోడ్లను వరద నీరు ముంచెత్తుతోంది. ఈ నీటిలో ప్రమాదకరంగా ఉండే లోతైన మ్యాన్‌హోల్స్‌ను చూసుకోకుండా వెళ్లడం తద్వారా ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు నగరంలో అనేకం చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ఎటువంటి ప్రమాదాలూ జరకుండా చూడాలని జలమండలి భావిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో వరద నీటిలో జలమండలి డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు తెరవకుండా ఇక్కడ లోతైన మ్యాన్‌హోల్ ఉంది అంటూ హెచ్చరికలు జారీ చేస్తూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జలమండలి వర్షాకాలానికి మూడు వారాల ముందే మేల్కొని ఎక్కడెక్కడ లోతైన మ్యాన్‌హోళ్లు ఉన్నాయో గుర్తించింది. అంతేకాకుండా వరదలు వచ్చినప్పుడు ఆ మ్యాన్‌హోల్ వద్ద జాగ్రత్తగా వెళ్లాలంటూ మూతలపై ఎర్రటి రంగు వేయడమే కాకుండా అక్కడ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

- మూతలపై రెడ్‌మార్క్‌తో అలర్ట్
- వర్షాకాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు
- ప్రతి మూత వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన జలమండలి అధికారులు



లోతైన మ్యాన్‌హోల్ ఉందని తెలిసేలా ఎర్రటి రంగుతో కూడిన మూత ఏర్పాటు



మ్యాన్ హోల్‌పై ఏర్పాటు చేసిన నీలిరంగు సేఫ్టీ గ్రిల్స్

- జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమతనగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనతనగర్ డివిజన్ల పరిధుల్లో ఒకటిన్నర మీటర్ల లోతుకు పైగా ఉన్న 1400 మ్యాన్‌హోళ్లను అత్యంత లోతైనవిగా గుర్తించారు.
- మ్యాన్‌హోల్ మూతల కింద పొరపాటున ఎవరైనా కాలు వేసినా జారిపోకుండా బ్లూకలర్‌సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఈ మ్యాన్‌హోల్ లోతైనవి అని తెలియజేసేందుకు మూతలపై ఎరుపు రంగు వేశారు.

మరి జీహెచ్ఎంసీ..

జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో వరద నీరు వెళ్లే మ్యాన్‌హోళ్లు వేలల్లో ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం సదరు మ్యాన్‌హోల్ వద్ద ఎలాంటి జాగ్రత్తలూ తీసుకున్న సందర్భాలు లేవు. గతంలో వరదనీటితో పాటు నాలాల్లో కొట్టుకుపోయి పౌరులు మృతి చెందిన ఘటనలు వెలుగుచూసినా జీహెచ్ఎంసీ స్పందించకపోవడం గమనార్హం. జీహెచ్ఎంసీకి సంబంధించిన వరదనీటి మ్యాన్‌హోళ్లు లోతైనవి వేలల్లో ఉండగా అవి ఎక్కడెక్కడ ఉన్నాయో సంబంధిత అధికారులకు కూడా తెలియని పరిస్థితి. వర్షాకాలం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో, అమలుచేయడంలో జలమండలి ముందుండగా, జీహెచ్ఎంసీకి మాత్రం తీరుబడి లేకుండాపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఇప్పటికే 900లకు పైగా మ్యాన్‌హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎరుపు రంగు కలర్ కూడా వేయడం పూర్తి చేశారు.
- డివిజన్-6 పరిధిలో మొత్తం 33 వేల మ్యాన్‌హోళ్లు ఉండగా ఇందులో 1,200 మాత్రమే లోతైనవని, అందుకే వీటి వద్ద జాగ్రత్తలు సూచిస్తున్నట్లు జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు.

ప్రమాదాలు నివారించేలా..

గతంలో వర్షాలు పడే సమయంలో నీటిని మళ్లించేందుకు చాలా ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరిచేవారు. ప్రమాదవశాత్తు అక్కడ కాలు వేసి, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మూతలపై రంగులు వేయడమే కాకుండా రెడ్ అలర్ట్ పేరిట సూచించిన బోర్డులను సైతం ఏర్పాటు చేస్తున్నారు.



మహంకాళి దేవాలయ సమస్యలపై ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలసిన ఆలయ కమిటీ సభ్యులు

మహంకాళి ఆలయానికి నిధులు పెంచండి

ఖైరతాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగ రోజున ఖైరతాబాద్ మహంకాళి దేవాలయానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ భవాని కృష్ణయాదవ్, అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, తదితరులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. బోనాల సందర్భంగా ఆలయంలో చాలా పనులు పెండింగ్‌లో ఉండడంతో ఈసారి నిధులు పెంచాలని కోరారు. బోనాల పండగ పూజలకు ఆహ్వానించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్‌దాస్, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్‌బాబు, మధుకర్‌యాదవ్, బాక్సర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మింట్ కాంపౌండ్‌లోని త్రిశక్తి హనుమాన్ దేవాలయం ముందు పారుతున్న డ్రైనేజీ మురుగు

ఆలయాల వద్ద పొంగుతున్న డ్రైనేజీ

ఖైరతాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఖైరతాబాద్‌లోని పలు ఆలయాల వద్ద డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. భక్తులు ఈ మురుగుగుండా ఆలయాల లోపలికి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నా అధికారులు స్పందించడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. మింట్ కాంపౌండ్‌లోని త్రిశక్తి హనుమాన్ దేవాలయంతో పాటు మార్కెట్ సమీపంలోని హనుమాన్ వ్యాయామశాల దేవాలయం వద్ద ఎన్నో రోజులుగా డ్రైనేజీలు పొంగతూ వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. ఈ విషయమై జలమండలికి ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని త్రిశక్తి హనుమన్ దేవాలయ చైర్మన్ శివకుమర్, హనుమాన్ వ్యాయామశాల దేవాలయం అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ జి.కృష్ణయాదవ్‌లు ఆరోపిస్తున్నారు. బస్తీలు, వీధులను ఎలాగూ పట్టించుకోవడం లేదు. కనీసం దేవాలయ ప్రాంగణాల్లోనైనా పరిశుభ్ర వాతావరణం ఉండేలా అధికారులు చొరవ చూపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ రంగం ప్రైవేటీకరణను తీవ్రంగా ఖండిస్తున్నాం : ఎస్‌యూసీఐ

హైదరాబాద్ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగం ప్రైవేటీకరణను ఎస్‌యూసీఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలంగాణ రాష్ట్రఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సీహెచ్.మురహరి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణలో భాగంగా ఒక పైలెట్‌ప్రాజెక్ట్‌గా హైదరాబాద్‌లో విద్యుత్‌పంపిణీ వ్యవస్థ ఫ్రాంచైజీ రూపంలో ఆదానీ సంస్థకు కట్టబెట్టే చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలో విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా ఉన్నాయని, దాన్ని గాడినపెట్టేందుకు భూగర్భ లైన్లు వేస్తూ, 75 శాతం బిల్లు వసూళ్లకు ఆదానీ కంపెనీకి అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదానీకి అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో మొదటి ప్రాధాన్యం ప్రైవేట్ కంపెనీలకు ఉండడం వినియోగదారులకు పూర్తివ్యతిరేకమన్నారు.

పెళ్లి చేసుకుంటానని అత్యాచారం

అమీర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవడం కోసం వరుడిని వెతుకుతున్న ఓ యువతికి ఓ షాదీ యాప్ ద్వారా పరిచయమైన ఒక ప్రబుద్ధుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ అయిన ఈ కేసు ఎస్ఆర్‌నగర్ ఠాణాకు బదిలీ కావడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పల్ ప్రాంతానికి చెందిన ఓ యువతి(27) పెళ్లి చేసుకోవడం కోసం జీవన్ షాదీ యాప్‌లో వెతుకుతుండగా ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జయప్రకాశ్‌నగర్‌లో ఫొటోస్టూడియో నిర్వహిస్తున్న ముత్తుమ్మిల్ల రాజశేఖర్ పరిచయమయ్యాడు. తను ఫొటోగ్రాఫర్‌ని.. పెళ్లి చేసుకుంటానిని పరిచయం పెంచుకున్నాడు. యువతికి చెందిన ఈమెయిల్ ఐడీని కూడా వినియోగించేవాడు. గత నెల 24న యువతికి ఫోన్ చేసిన రాజశేఖర్ తన ఫొటో స్టూడియోకు రమ్మన్నాడు. మరునటి రోజు స్టూడియోకి వచ్చిన యువతిని బెదిరించాడు. తను చెప్పినట్లు వినకపోతే తనకు మెయిల్ ద్వారా లభ్యమైన 'నీ ఫొటోలను అందరికీ పంపి, పరువు తీస్తానని చెప్పి అత్యాచారానికి పాల్పడాడు. విషయం ఎవరికైనా చెప్పితే చంపేస్తానని హెచ్చరించాడు. బాధితురాలు అక్కడి నుంచి బయటపడి, దగ్గరి బంధువైన మహిళకు విషయం చెప్పింది. వారు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి జీరో ఎఫ్ఐఆర్ ఎస్ఆర్‌నగర్‌కు బదిలీకావడంతో పోలీసులు నిందుతుడిపై కేసు నమోదు చేశారు.

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఎంసీపీఐ(యూ) డిమాండ్ చేసింది. సోమవారం ఎంసీపీఐ(యూ) నాయకులు నాంపల్లిలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



చెస్ట్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్ ఖాన్‌ను సన్మానిస్తున్న హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ సూర్యనారాయణ

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

ఎర్రగడ్డ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎర్రగడ్డలోని చెస్ట్ హాస్పిటల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ కుర్ర సూర్యనారాయణ ఆసుపత్రిలోని పలువురు వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గొప్పదని కొనియాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్ మాట్లాడుతూ ఏమీ పర్వాలేదు.. తగ్గిపోతుంది అంటూ చీటీ రూపంలో వైద్యులు ఇచ్చేదే రోగి జీవితానికి గొప్ప భరోసా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు నరేందర్, జ్యోతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వేణుగోపాల్‌రావు, కేవీ రమణాచారి, చంద్రప్రకాశ్‌రావు, సురభివాణి దేవి, డా.సరస్వతి తదితరులు

పీవీ నరసింహారావుకు నివాళి

మంగళ్‌హాట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో సోమవారం పీవీ నర్సింహారావుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, భాషా నిలయం గౌరవాధ్యక్షుడు కేవీ రమణాచారి, ఉపాధ్యక్షులు కె.చంద్రప్రకాశ్‌రావు, పీవీ కుమార్తెలు సురభివాణి దేవి, డాక్టర్ కె.సరస్వతి, డాక్టర్ విజయ సామరాజు, పి.వి.ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావుపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వేణుగోపాలరావు, రమణాచారి బహుమతులు అందజేశారు.



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేసిన శాలిని ప్రతాప్ తదితరులు

బోనాల ఉత్సవాల్లో వృత్తిదారుల డిమాండ్లను నెరవేర్చాలి

చాంద్రాయణగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలలో కీలక పాత్ర పోషించే వివిధ వృత్తిదారుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని పాతనగర ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సంఘం ప్రతినిధులు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖకు వినతిపత్రం అందజేశారు. వృత్తిదారులకు గుర్తింపుకార్డులు, 30 శాతం పారితోషికం, యూనిఫారమ్, వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని, ఇళ్లు కేటాయించాలని సంఘం అధ్యక్షుడు బి. నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి కొల్లూరు జ్ఞానేశ్వర్, కోశాధికారి గట్టు సుదర్శన్ మంత్రులను కోరారు.

రాజీవ్ నగర్‌లో విద్యుత్ కష్టాలు

ఎర్రగడ్డ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లో రాజీవ్ నగర్‌లో వర్షం పడ్డ ప్రతిసారి గంట నుంచి రెండు గంటల వరకు విద్యుత్ పోతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో స్థానికంగా కరెంటు కష్టాలు అధికమవుతున్నాయని పేర్కొంటున్నారు. వర్షం పడ్డ ప్రతిసారీ కరెంట్ పోవడం, తిరిగి గంట నుంచి రెండు గంటల వరకు రాకపోవడం జరుగుతోందన్నారు. కాలనీవాసులు, సంక్షేమ సంఘం సభ్యులు విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేస్తే తప్ప కరెంటు తిరిగి రావడం లేదని చెప్తున్నారు. ఒక్కోసారి వర్షం పడనప్పుడు కూడా ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి కరెంటు సరఫరా ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజీవ్‌నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.



డీఈఓ రోహిణికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఉపాధ్యాయుల కొరతపై దృష్టి సారించండి

బంజారాహిల్స్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ రౌండ్ టేబుల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే కొరతపై దృష్టి సారించాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఫిలింనగర్‌లో అతిపెద్ద రౌండ్ టేబుల్ పాఠశాలలో 30 మంది ఉపాధ్యాయులకు గాను కేవలం ఆరుగురే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్నివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీజేఆర్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరి చాలాకాలం అవుతోందని, పాత భవనం స్థానం కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఎన్ఎస్ఎస్ చట్టం కింద మొదటి కేసు నమోదు

బంజారాహిల్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీఎన్ఎస్ఎస్ చట్టం అమలులోకి వచ్చిన మొదటి రోజు బంజారాహిల్స్‌లో మొదటి కేసు నమోదు అయింది. బంజారాహిల్స్‌రోడ్డు నంబరు 14, నందినగర్‌లో నివాసముండే దొడ్ల ప్రదీప్‌కుమార్, అనిత భార్యాభర్తలు. వీరికి బీటెక్ చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. ప్రదీప్ కొంతకాలంగా టీబీ, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నాడు. గత నెల 30న రాత్రి భోజనం ముగించుకొని బాత్‌రూంలోకి వెళ్లిన ప్రదీప్ చాలా సేపటి వరకు బయటకు రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు చూడగా అతని నోట్లో నుంచి రక్తంరావడం గమనించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్ఎస్ 194 కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4న అధికారికంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం

అఫ్జల్‌గంజ్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ వర్ధంతిని ఈనెల 4వ తేదీ ఉదయం 9.30 గంటలకు రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం తెలిపారు. సోమవారం ముస్లింజంగ్ పూల్ వంతెన వద్ద గల తెలంగాణ కురుమ సంఘం భవనంలో కొమురయ్య వర్ధంతి కార్యక్రమ ఏర్పాట్లపై ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పొన్న ప్రభాకర్, ఎమ్మెల్యేలు, బీర్ల ఐలయ్య, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, మల్లయ్య యాదవ్, అంజయ్య యాదవ్, క్యామ మల్లేషం, నోముల భరత్, దూదిమెట్ల బాల్‌రాజ్ తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, హాస్టల్ ట్రస్టు చైర్మన్ కొలుపుల నర్సింహ, జంట నగరాల అధ్యక్షుడు నర్స వినోద్‌కుమార్, రాష్ట్రనాయకులు కొండల్‌రాజు, ఎక్కాల కన్న, కె.విమల్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు టి.అరుణ్ కుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పి.బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ.. లేపక్షి వ్యర్థమే!



ట్యాంక్‌బండ్‌పై ఉన్న లేపాక్షి ఎంపోరియాన్ని నెలక్రితమే రంగులేసి సుందరీకరించారు. కానీ రంగులేసిన నెలరోజులకే ఎంపోరియం పావురాల వ్యర్థాలతో మళ్లీ నిండిపోయింది.
- ఫొటో- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్

మహిళల ఆరోగ్యం కోసం 5కే రన్

పలువురు వైద్యులను సత్కరించిన అమ్మని ఫౌండేషన్



రన్ చేస్తున్న యువతులు



ప్రతిజ్ఞ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, అమ్మని ఫౌండేషన్ నిర్వాహకులు, తదితరులు

ఖైరతాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు, కుటుంబ సభ్యుల కోసం పరితపిస్తూ వారి ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడం మంచిదికాదని పలువురు వైద్యులు పేర్కొన్నారు. సోమవారం వైద్యుల దినోత్సవం సందర్భంగా అమ్మని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం కోసం 5కే రన్‌ను నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి ఈ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను ఘనంగా సత్కరించారు. స్పీకర్ ప్రసాద్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో దూసుకువెళ్తున్నారని, వారి ఆరోగ్యం కోసం అమ్మని ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. సునీతమహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు శక్తివంతులుగా ఉండాలన్నారు. బాలికలు చాలా మంది పదో తరగతి పూర్తవగానే చదువు ఆపుతున్నారని, ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలాంటివారిని ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా అమ్మని ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ ములుగు అమ్మని ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి వైద్యులు జ్యోతిరెడ్డి, విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, సర్కిల్ 17మెడికల్ అధికారిణి డాక్టర్ ప్రావీణ్య, డాక్టర్ ఓ.నాగేశ్వరరావును సత్కరించారు.



జలమండలి ఎండీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, సమస్యల గురించి వివరిస్తున్న వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి
- బంజారాహిల్స్, జూలై 1(ఆంధ్రజ్యోతి)



బొల్లారం స్టేషన్‌లో బీఆర్ఎస్వీ, వివిధ సంఘాల విద్యార్థి నేతలు

ఠాణాలో విద్యార్థి నేతలు

తిరుమలగిరి జులై 1 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్వీ, ధర్మాస్టూడెంట్స్ యూనియన్ నేతలను అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్ కు తరలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఠాణాలోనే ఉంచిన ఆయా నేతలను సాయంత్రం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మోతీలాల్ నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. నిరుద్యోగ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ నిరుద్యోగులు పోరాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ యాదవ్, శశాంత్ రెడ్డి, జడ్సన్, ధర్మాస్టూడెంట్స్ నేతలు కార్తిక్, హనుమంత్‌నాయక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



ఈశ్వర్

బౌద్ధనగర్, జులై 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లో వీడియోలు ఎక్కువగా చూస్తున్నాడని తల్లి మందలించటంతో ఓ బాలుడు అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌నగర్ కట్టా ప్రాంతానికి చెందిన ఎస్.భవాని కుమారుడు ఈశ్వర్(14) స్థానికంగా ఓ స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లి పడుకున్న సమయంలో ఈశ్వర్ సెల్‌ఫోన్‌లో అసభ్యకర వీడియోలు చూస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కుమారుడిని మందలించింది. దీంతో జూన్ 30వ తేదీ సాయంత్రం 3:30గంటల సమయంలో ఈశ్వర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం పలుచోట్ల గాలించినా ఫలితంలేకపోవడంతో తనకుమారుడు కనిపించటంలేదని సోమవారం సాయంత్రం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

యువకుడి ఆత్మాహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

అడ్డగుట్ట, జులై 1 (ఆంధ్రజ్యోతి): స్థాయికి మించి అప్పులు చేశానని, డబ్బులు కావాలని అడగగా తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో చేయి కొరికి మనస్థాపంతో ఆత్మాహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మరణించిన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన నర్సింగ్ (28) ఆటో డ్రైవర్. పీకల దాక అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. గత నెల 19న తాను అప్పులు చేశానని, మూడు లక్షలు కావాలని తల్లిని వేధించడంతో తల్లి డబ్బులు ఇవ్వలేదు. ఆగ్రహానికి గురైన కొడుకు తల్లి చేయి కొరికి పారిపోయాడు. ఇంటికి వచ్చిన అనంతరం బాత్‌రూంకు ఉపయోగించే యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోగా తల్లి గమనించి, వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీసులు గాంధీ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు మార్చురీకి తరలించారు.

మనస్తాపంతో యువకుడు...



అఖిల్

తిరుమలగిరి, జులై 1 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిపోయానన్న మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బొల్లారం పోలీసుల కథనం ప్రకారం... ఆదర్శ్‌నగర్‌లో నివసించే రవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కొన్నేళ్ల క్రితం భార్య చనిపోవడంతో పెద్దకుమారుడైన అఖిల్(18) ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ మెస్‌లో సర్వెంట్ ఉద్యోగం చేస్తూ క్వార్టర్స్‌లో ఉంటున్న నానమ్మ ఊర్మిళ వద్ద ఉంటున్నాడు. 2003లో పదో తరగతి పరీక్షలు రాయగా ఉత్తీర్ణుడు కాలేదు. 2004లో తిరిగి పరీక్షలు రాయగా ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. అప్పటి నుంచి చదువు అబ్బడంలేదని బెంగతో ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సైదులు

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

- ఇద్దరు దొంగలు అరెస్ట్ : బంగారు గొలుసు స్వాధీనం

బౌద్ధనగర్, జులై 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంపుకుని పారిపోయిన ఇద్దరు దొంగలను వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండుతులాల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సైదులు, అడ్మిన్ ఎస్సై సుధాకర్‌లు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వారాసిగూడకు చెందిన కె.శారద(71) జూన్ 27వ తేదీ ఉదయం ఏడున్నరగంటల సమయంలో ఇంటిగేటు బయట నిలబడి, కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వెళ్లుతుండగా ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో రెండు తులాల బంగారు గొలుసుని తెంపుకుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులను మాణికేశ్వరినగర్‌కు చెందిన కూలీలు కొరుదాల శ్రీనివాస్(48), కుంచపు పుల్లయ్య(62)గా గుర్తించారు. సోమవారం ఉదయం మాణికేశ్వరినగర్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



రైల్వే స్టేషన్‌లో గంజాయిని పట్టుకున్న జీఆర్‌పి పోలీసులు (1ఎస్ఇసిపి21)

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి 18కిలోల గంజాయిని సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ జావీద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌ల కథనం ప్రకారం... సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 1లో జీఆర్‌పీ ఎస్సై రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదస్థితిలో ఉన్న వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా అందులో 18కిలోల గంజాయి ఉన్నట్లు జీఆర్‌పీ పోలీసులు కనుగొన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి మహారాష్ట్ర అమీనానగర్ ప్రాంతానికి చెందిన అబుకర్ కాసంషేక్ (47) అని తేలింది. విశాఖపట్నం నుంచి 18కిలలో గంజాయిని కోనుగోలు చేసి మహారాష్ట్రకు తీసుకెళ్లి అధిక ధరలకు విక్రయిస్తున్నాడని విచారణలో తేలింది. నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

యువత రక్తదానం చేయాలి

- రోగి ప్రాణాలు కాపాడాలంటే రక్తం అవసరం
- ప్రొఫెసర్ రాజారావు



గాంధీలో రక్తదానం చేస్తున్న సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు

అడ్డగుట్ట, జులై 1 (ఆంధ్రజ్యోతి) : రోగుల ప్రాణాలు నిలబెట్టాలంటే అత్యవసరపరిస్థితిలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు సూచించారు ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం గాంధీ ఆస్పత్రిలోని మొదటి అంతస్థులో బ్లడ్ బ్యాంక్‌లో వైద్యులందరూ కలిసి కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ స్వయంగా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో లక్షలమందికి వైద్యం చేస్తున్నాం కొందరికి రక్తం అందుతుంది, కొందరు ఇబ్బందిపడాల్సి వస్తుంది. యువతీయువకులు రోగి ప్రాణాలు నిలబెట్టేందుకు అప్పుడప్పుడు రక్తదానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వైద్యుల దినోత్సవం సందర్భంగా గాంధీలో 48మంది రక్తదానం చేయగా, 167మంది బయటి వ్యక్తులు రక్తదానం చేసి బ్లడ్ బ్యాంక్‌కు అప్పగించారు. ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియదు కానీ రక్తదానం అనేది ముఖ్యమన్నారు. రోగి ప్రాణాలు నిలబెట్టేందుకు ముఖ్యంగా రక్తం అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ రెడ్డిలతో పాటు ఆర్ఎంఓ1 డాక్టర్ జయకృష్ణ, ఆర్ఎంఓలు పాల్గొన్నారు.



షటిల్ క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

పార్కుల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జులై 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న పార్కుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. సోమవారం సీతాఫల్‌మండి కార్యాలయంలో చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్కులో షటిల్ ఆడే క్రీడాకారులు పద్మారావుగౌడ్‌ను కలిశారు. చిలకలగూడ పార్కులో షటిల్ ఆడుకునేందుకు జీహెచ్ఎంసీ అధికారులు అనుమతించటంలేదని వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదుచేశారు. పార్కులో ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు జరుపుతామని పద్మారావుగౌడ్ తెలిపారు. ఫ్రైడే మార్కెట్ సమీపంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదించామని, త్వరలో నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. షటిల్ క్రీడాకారులు బిట్ల రఘునందన్, అనిల్, రెడ్డి, శేఖర్, బాబాయి, శ్రీనివాస్ నాయకులు గరిగిపోగుల చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లేదెలా?

- ఇరుకు దారితో విద్యార్థులు, తల్లిదండ్రుల అవస్థలు
- పాఠశాల ప్రధాన ద్వారం మార్చాలని ప్రజావాణిలో ఫిర్యాదు

చిలకలగూడ, జులై 1 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్, దూద్‌బావిలో ప్రభుత్వ పాఠశాలకి వెళ్లేందుకు సరైన దారి చూపాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. బస్తీలో నుంచి స్కూల్‌కి వెళ్లడానికి రోడ్డు చాలా ఇరుకుగా వుందని, టూవీలర్ నడపడం కూడా కష్టంగా వుందని, అంగన్‌వాడీ కేంద్రం కూడా ఇదే పాఠశాలలో వుండటంతో మధ్యాహ్న భోజనం తీసుకురావడం ఇబ్బందిగా వుందని, విద్యార్థులు, తల్లితండ్రులు, గర్భిణీలు నిత్యం నరకయాతనపడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో వుంచుకుని స్కూల్ తూర్పువైపు ప్రధాన ద్వారం ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ నాయకులు కోమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, గువ్వల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుపల్లి రెవిన్యూ కార్యాలయాన్ని తరలించాలని వినతి

అడ్డగుట్టలోని మారేడుపల్లి రెవిన్యూ కార్యాలయం అక్కడి నుంచి తరలించి ప్రభుత్వ పాఠశాలకు ఆ భవనం అప్పచెప్పాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో ప్రైవేటు స్కూళ్లకి తరలి వెళుతున్నారని, ప్రస్తుతం వున్న ఎమ్మార్వో కార్యాలయం ప్రభుత్వ పాఠశాల సొంత భవనం కనుక స్కూల్‌కి కేటాయించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



డాక్టర్ ప్రశాంత్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యసంఘం సభ్యులు

వైద్యులకు ఆర్యవైశ్య సంఘం సన్మానం

బౌద్ధనగర్, జులై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డేని పురస్కరించుకుని సోమవారం పలువురు వైద్యులను వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం వారు సత్కరించారు. వారాసిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వైద్యులకు పూల దండలు వేసి, శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని, ఎంతోమంది ప్రాణాలను కాపాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కురాకుల సుధాకర్, కార్యదర్శి బి.రాజేష్, కోశాధికారి ఎం.వీరశేఖర్, సభ్యులు రామకృష్ణ, ఏలకంటి శివ కుమార్, వంశి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. సీతాఫల్‌మండి మేడిబావి జ్యోతి మోడల్ స్కూల్‌లో విద్యార్థులు వైద్యులను సత్కారించారు.



మహంకాళి దేవాలయ సమస్యలపై
ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



ఆరోగ్య మహిళ కార్యక్రమంలో వైద్యురాలు ప్రశాంతి, సిబ్బంది

బోయగూడ కేంద్రంలో ప్రతీ మంగళవారం 'ఆరోగ్య మహిళ'

పద్మారావునగర్ జులై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తోంది బోయగూడ ఐడీహెచ్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గాంధీ) ద్వారా ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలను అందిస్తున్నామని కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలియజేశారు. మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు అందరికీ అవసరమైన రోగ నిర్ధారణ, వైద్య పరీక్షలు, మందులు వంటి అనేకరకాలైన వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతీ మంగళవారం కేంద్రంలో ఆరోగ్య మహిళ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రత్యేక చికిత్స అవసరమైనవారిని ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నామని తెలిపారు. అంతేకాక వారిని నిరంతరం ఆశావర్కర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందుతున్న సేవలను అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.



రైల్వే డాక్టర్లతో పీసీపీఓ కిషోర్‌బాబు

రైల్వేలో ఘనంగా డాక్టర్స్‌డే

చిలకలగూడ, జులై 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, రైల్‌నిలయంలో సోమవారం ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కిషోర్‌బాబు విచ్చేసి మాట్లాడుతూ డాక్టర్లు ప్రాణదాతలని, వారి సేవలకి వెల కట్టలేమని తెలిపారు. రోగులకి మెరుగైన సేవలు అందించడానికి డాక్టర్లు కృషి చేయాలని సూచించారు. రైల్వే డాక్టర్లు వెంకటేశ్వర్లు, పద్మ, జ్యోత్న, చేతన్, పాండు, హక్, రమేష్, ఎస్.వీ.బీ.కే.సాయి తదితరులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు నగరం శ్రీధర్, యుగంధర్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో మైకేల్స్ జట్టు

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సెయింట్ మైకేల్స్ జట్టు విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): డెకాథ్లాన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సెయింట్ మైకేల్స్ జట్టు విజేతగా నిలిచింది. అండర్-13 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 14 జట్లు పోటీపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్లో సెయింట్ మైకేల్స్ (అల్వాల్) జట్టు 6-0తో రెక్విల్ ఫోర్డ్ (రాంపల్లి) టీమ్‌ను చిత్తుగా ఓడించి, ట్రోఫీ దక్కించుకుంది. ఫైనల్లో రియాన్ 3, జైసన్, అక్షాంత్, విక్రాంత్ తలో గోల్ చేశారు.

ట్రాన్స్‌జెండర్స్ తెలంగాణ చారోచటయి రోటీ ఉత్సవాలు

బౌద్ధనగర్, జులై 1 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్స్ ప్రతి సంవత్సరం నిర్వహించే తెలంగాణ చారోచటయిరోటీ, మురిగిమాత ఉత్సవాలు సోమవారం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. బుధవారం వారి కులదైవమైన మురిగిమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈవేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ముంబాయి, కలకత్తా, వివిధ రాష్ట్రాల్లో ఉన్న ట్రాన్స్‌జెండర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నగ్నమాలక్, రుక్సర్, ఈశ్వరి, సజిని, మీనా, జానకి, రమ్య, పప్పి, ఆర్తి, పల్లవి, స్వప్న, శిల్ప పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో.. 100కు డయల్ చేయండి

- ఏసీపీ సుబ్బయ్య
- పిల్లలకు చదువు చెప్పించండి
- బాల్య వివాహాలు చేస్తే జైలుకే

అడ్డగుట్ట, జులై 1 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో, మీ ప్రాంతాల్లో ఏదైనా ప్రమాదాలు, ఆపద వస్తే వెంటనే 100కు డయల్ చేయాలని నార్త్ జోన్ గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంబంటి అంజనేయులు ప్రజల్ని కోరారు. సోమవారం రాత్రి తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రైల్ నిలయం అంబేద్కర్‌నగర్ బస్తీ 80శాతం పొట్టకూటి కోసం పనిచేసుకుంటున్న నిరుపేదలు, ప్రజల్లో పోలీసింగ్‌పై అవగాహన కల్పించేందుకు రాత్రి ప్రజలతో మమేకమై కౌన్సిలింగ్ ఇచ్చారు. మీ ఏరియాలో నేరాలు జరిగితే వెంటనే పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలి లేదంటే 100 డయల్ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాత్రి అయిందంటే చాలు చిన్నచిన్న గొడవలు తెలిసీ తెలియకుండానే జరుగుతుంటే పోలీసులతో సత్సంబంధాలు పెట్టుకుని సమాచారం ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. బస్తీలో ఉంటూ తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బాలికలకు పెళ్ళిళ్లు చేస్తున్నారని, వయస్సు నిండిన తరువాతనే పెళ్లి చేయాలని, లేదంటే చైల్డ్ యాక్టు కింద కేసులు నమోదు అవుతాయని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉంటున్నప్పటికీ బడికి వెళ్లడంలేదని తెలిసింది.



అంబేద్కర్‌నగర్ ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, సీఐ అంజనేయులు

తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. మీలో ప్రతిఒక్కరూ పోలీసులకు సూచనలు ఇస్తూనే పోలీసులకు సహకారం అందించాలన్నారు. ప్రతి బస్తీలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకతీతంగా బస్తీ కోసం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బుర్ర అపర్ణకు ఓయూ డాక్టరేట్



బుర్ర అపర్ణ

తార్నాక, జులై 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలానికి చెందిన బుర్ర అపర్ణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఓయూలోని భౌతికశాస్త్రం విభాగంలో డా.కలీం అహ్మద్ జలీలి పర్యవేక్షణలో నానో ఫైరెట్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగిందని సోమవారం ఆమె తెలిపారు. బుర్ర అపర్ణకు డాక్టరేట్ రావడం పట్ల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, కుటుంబసభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.



మింట్ కాంపౌండ్‌లోని త్రిశక్తి హనుమాన్ దేవాలయం ముందు పారుతున్న డ్రైనేజీ మురుగు

ఆలయాల వద్ద పొంగుతున్న డ్రైనేజీలు భక్తులకు తీవ్ర ఇబ్బందులు

ఖైరతాబాద్, జులై 1 (ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఖైరతాబాద్‌లోని పలు ఆలయాల వద్ద డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. భక్తులు ఈ మురుగుగుండా ఆలయాల లోపలికి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నా అధికారులు స్పందించడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. మింట్ కాంపౌండ్‌లోని త్రిశక్తి హనుమాన్ దేవాలయంతో పాటు మార్కెట్ సమీపంలోని హనుమాన్ వ్యాయామశాల దేవాలయం వద్ద ఎన్నో రోజులుగా డ్రైనేజీలు పొంగతూ వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. ఈ విషయమై జలమండలికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని త్రిశక్తి హనుమన్ దేవాలయ చైర్మన్ శివకుమార్, హనుమాన్ వ్యాయామశాల దేవాలయం అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్‌లు ఆరోపిస్తున్నారు. బస్తీలు, వీధులను ఎలాగూ పట్టించుకోవడం లేదు. కనీసం దేవాలయ ప్రాంగణాల్లోనైనా పరిశుభ్ర వాతావరణం ఉండేలా అధికారులు చొరవ చూపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టం' కింద తొలి కేసు నమోదు

అల్వాల్, జులై 1 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలన నుంచి కొనసాగుతున్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి(సీఆర్‌పీసీ) చట్టాల స్థానంలో గత ఏడాది పార్లమెంట్‌లో ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్ఏ) అమల్లోకి వచ్చిన తరువాత అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కొత్త చట్టం ప్రకారం సోమవారం తొలి కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూన్ 26వ తేదీన సాయంత్రం ఒక ఇంటిపైన సమీర్ కుమార్‌గుప్తా (63) వాటర్ లీకేజీ ట్యాంక్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారీ బిల్డింగ్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సమీర్‌కుమార్ గుప్తాను గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. దీంతో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్) ప్రకారం అండర్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కేసు నమోదు చేశారు.

అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గణేష్



మల్లాపూర్, జులై 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ డివిజన్ పరిధిలో అరుంధతి సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎడాల గణేష్ గెలుపొందారు. ఈకార్యక్రమంలో శంకర్, పీజీ సుదర్శన్, మెండ జితేందర్, రఘువరణ్ పాల్గొన్నారు.



ఖాతాదారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న బ్యాంక్ మేనేజర్ సాయిలత

ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తాం

మౌలాలి,జులై 1 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యమని వెస్ట్ మల్కాజిగిరి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సాయిలత పేర్కొన్నారు. సోమవారం ఎస్‌బీఐ 69వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఖాతాదారులతో కలిసి మేనేజర్ సాయిలత కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు కిర్మణ్మయి, దివ్య, శ్రీకాంత్, పార్థో, నవీన్, ఖాతాదారులు ఏవీ స్వామి, విజయ్‌ప్రసాద్‌రెడ్డి, రాజేశ్వరరావు, రాజేశ్వరి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ టీచర్లు

అంగన్వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

మల్కాజిగిరి, జులై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్లు కోరుతున్నారు. ఈమేరకు సోమవారం ఉప్పరిగూడలో అంగన్వాడీ టీచర్లు ఆందోళన నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లను జూలై 24 తర్వాత ఇంటికి పంపించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ తెలంగాణ టీచర్స్ హెల్పర్స్ వెల్ఫేర్ యూనియన్ కార్యదర్శి శోభారాణి, పలువురు అంగన్వాడీ వర్కర్లు, టీచర్లు పాల్గొన్నారు.